


పి. వి. ఆర్. శివకుమార్

# జ్ఞాన సుందరం

జ్ఞానసుందరం మా సెక్షన్లో జాయినయిన రోజు అతడిని చూసి అవహేళనగా నవ్వుకున్న వాళ్ళలో నేనూ ఒకణ్ణి. క్రమంగా రోజులు గడిచిన కొద్దీ అతడికి నే నెందుకు అంతలా సన్నిహితుణ్ణయ్యానో నా కిప్పుడు స్పష్టంగా గుర్తులేదు. అయితే మా సెక్షన్లోనే కాదు—మా ఆఫీసు మొత్తంమీద జ్ఞానసుందరంతో స్నేహం చేసిన వాళ్ళలో నేనే మొదటివాణ్ని. నేనే చివరివాణ్ని కూడా!

నాలుగే నాలు గడుగుల ఎత్తు. అడుగున్నర మించని చేతులు, కొద్దిగా పొడుగ్గా కనిపించే తల నాలుగు రోజులు పోతే నలుపులో కలిసిపోయేట్టున్న రంగు —ఇదీ జ్ఞానసుందరం రూపం. అతడి పేరే చెబుతోంది అతను జ్ఞానంలో తప్ప దేహంలో ఎలాంటి సౌందర్యమూ లేనివాడని!

సుందరం ఓర్పు ఎదటి వాళ్ళ అపహాస్యాలని కూడా స్పోర్టివ్‌గా తీసుకుని, తనని హేళన చేసే వాళ్ళని కూడా మన్నించే గుణం అవే — బహుశః అతన్లో నన్ను ఆకర్షించిన గుణాలనుకుంటాను. అంద వికారంగా వున్నా అతన్లో ఆత్మవిశ్వాసం వుంది. చిన్నప్పటి నుంచీ చుట్టుపక్కలవాళ్ళ అవహేళనలు అలవాటై పోబట్టి అతని మనసు రాటుదేలిపోయి, వాటిని లక్ష్యపెట్టటం మానేసిందని అనుకునేవాణ్ని.

నేను కథలు రాస్తానని అతనికి తెలిసిన మొదటి రోజునే అతను నాతో పరిచయం చేసుకున్నాడు.

"నమస్తేసార్! ఈవారం ప్రభలో '—కథ మీరేనటగా రాసింది" అంటూ నా దగ్గరకు వచ్చాడు ఆ సాయంత్రం ఆఫీసు వదిలేవేళ, సుందరం.

"అవునండీ" అన్నాను క్లుప్తంగా. ఆఫీసు వదిలేశాకకూడా నా వెనకేవచ్చి, కలిశాడు. ఇద్దరం పదడుగులు వేశాక, "కాఫీ తాగిపోదాం రండి" అంటూ నా జవాబు కోసం ఆగకుండానే 'ద్వారక' లోకి దారితీశాడు.

టిఫిన్ చేస్తుండగా నా కథగురించి మాట్లా

డాడు. బాగుందని పొగిడాడు. ఇది ప్రచురణ యిన నా డెబ్భయ్యో కథ. అందుకే నేనంతగా పొంగిపోలేదు. 'థాంక్స్' అని మాత్రము అన్నాను.

"గురూగారూ, నాకు థాట్స్ వస్తుంటా యండీ! కథా రూపంలో పెట్టటమే కుదరటం లేదు. కొన్ని రాశానుకూడా. కానీ, తిరిగి వచ్చేశాయి" అంటూ ఆగాడు.

ఇలాటి మాటలు వినడం అప్పుడప్పుడూ నాకు మామూలే. అందుకే నేనే అన్నాను— "అవి ఓసారి ఇవ్వండి. చూసి యిస్తాను!"

"అబ్బే! అవెందుకులెండి. అసలిప్పుడు నాకు కథలు రాయాలని కోరికకూడా లేదు. ఎందుకంటే నాకే తెలిసిపోయింది, నా బుర్ర ఆలోచించటానికే తప్ప రాయటానికి పనికి రాదని" అంటూ నవ్వేశాడు.

నాకొంచెం ఆశ్చర్యంగా అనిపించింది. సాధారణంగా ఇలాటివాళ్ళు, రచయితంటూ ఎవరన్నా కనిపించగానే, తమ కథల్ని దిద్ది పెట్టమనో, ఎలా రాయాలో సలహా చెప్పమనో వేధిస్తారుగానీ, ఇలా తమ అసమర్ధతని ఒప్పు కుని, సహాయాన్ని తిరస్కరించరు.

"అలా ఎందుకనుకుంటారు? ప్రయత్నిస్తే మీరూ రాయగలుగుతారేమో" అన్నాను.

"వద్దులెండి గానీ, నాదో చిన్న రిక్వెస్టు వుంది. మీరు ఒప్పుకోవాలి" అన్నాడతను.

"చెప్పండి."

"ఇక్కడ కాదులెండి. నా రూమ్‌కి వెళ్ళాక చెప్తాను. మీరిప్పుడు నా రూమ్‌కి రావాలి."

సుందరం గది ఆఫీసుకి దగ్గరే. పది నిము షాలు నడిచేక ఆ గది చేరుకున్నాం. రేకుల షెడ్‌లాగా వున్న ఆ చిన్నగదిలో అతనెలా వుండగలుగుతున్నాడో — ఆశ్చర్యం వేసింది. లోపల ఓ మంచం, దానికింద ఓ రేకుపెట్టె, గదిమూలగా వంటచేసుకోడానికి ఓ స్టవ్, నాలు గాయిదు గిన్నెలు— అంతే ఆ గదిలోవున్న సామాను.

మంచంమీదే కూర్చున్నాం. సుందరం పెట్టెలోంచి ఓ ఫైలుతీసి నాకు అందించాడు. కథలేమో అనుకుని తెరిచాను. కానీ అందులో వున్నవి కథలుకావు. చిత్రాలు! మామూలు తెల్లకాయితాలమీద వేయబడ్డ అపురూపమైన ప్రకృతి సౌందర్య దృశ్యాలు! సుందరం ఆర్టిస్టుకూడా నన్నమాట!

"చాలా బావున్నాయండీ" మనస్ఫూర్తిగా అన్నాను.

"ఇవే కాదండీ. నా హేండ్ రైటింగ్ కూడా బావుంటుంది. అదే నే చెప్పిన రిక్వెస్టు. మీ కథలు నన్ను ఫెయిర్ చెయ్యనిస్తారేమో అడగాలనే!" అన్నాడు సుందరం.

"ఛ .ఛ .భలేవార్లే! మీకెందుకూ ఆ శ్రమ?" అన్నాను.

"శ్రమేంకాదు. అదో ఉత్సాహం. నాకై నేను రాయలేక పోయినా, మీరు రాసేవన్నా ఫెయిర్ చెయ్యగలిగితే అదో తృప్తినాకు."

"సారీ! నా కథల్ని నేనే ఫెయిర్ చెయ్యాలి తప్ప, మరొకరు చెయ్యటం కుదరదు. ఎందు కంటే, ఫెయిర్ చేసేటప్పుడు నేను మార్పులు చాల్తా చేస్తూవుంటాను" అన్నాను. అది నిజం కూడా.

కాసేపు కూచున్నాక, మా అడ్రసుచెప్పి, ఎప్పుడన్నా రమ్మని నేను వాచ్చేశాను. అదే మా మొదటి పరిచయం.

* * *

కొన్నాళ్ళు గడిచేసరికి మా సెక్షన్లో పెద్ద చర్చనీయాంశ మయిపోయాడు సుందరం. అందుకు కారణం అతని రూపమొక్కటే కాదు.

నెలకి నాలుగొందలు పైగా వస్తుంది అత నికి జీతం. పెళ్ళికాలేదింకా. అంతకుమించి అతని పర్సనల్ మేటర్స్ ఎవరికీ తెలియవు. అతను ఎవరితోనూ చెప్పుకోలేదు.

ముప్ఫయి రూపాయల ఆ రేకులగదిలో ఎలా బతుకుతున్నాడో తెలియదు. ఆ గది లోనే, రెండుపూటలా వంటకూడా చేసు కుంటాడు. బయటెక్కడా కాఫీకూడా తాగడు. [అలాంటివాడు ఆరోజు నాకు హోటల్లో కాఫీ, టిఫిన్లు ఇప్పించాడంటే, రచయితలంటే అతని కున్న అడ్మిరేషన్ యెంతటిదో అనిపించింది

నాను.] కాటన్ బట్టలుమాత్రమే వాడతాడు. అవీ రెండు, మూడు జతలకన్న లేవు. సిగరెట్లు కాల్చడు. సినిమాలు చూడడు. ఇంకెలాంటి దురలవాట్లులేవు. ఇంత జీతం వస్తుంది. అతని ఖర్చులుచూస్తే నెలకి నూటయాభై కన్న అయేలా లేవు. మరి మిగతాడబ్బంతా యేం చేస్తున్నట్టు? ఎందుకంత పిసినారిలా గడుపుతాడు? ఇదే ఆఫీసులో అందర్నీ పీడించే ప్రశ్న.

"ఏమో, అతనికి ఫామిలీ ప్రాబ్లమ్స్ ఏమున్నాయోలెండి" అని నేను సమర్థించినా ఎవరూ ఒప్పుకోలేదు. కుటుంబ సమస్యలే వుంటే, అంత వుత్సాహంగా వుండడం యే మనిషికీ తరంకాదని కొట్టిపారేశారు.

* * *

ఒకటి, రెండుసార్లు నాగదికి వచ్చాడు సుందరం. నెమ్మదిగా అతన్ని ప్రోత్సహించాను తన బొమ్మల్ని పత్రికలకు పంపమని.

"అవా? అవెవరు వేసుకుంటారండీ?" అనేశాడు మొదట్లో. కానీ, పోరగా పోరగా చివరకి ఒప్పుకున్నాడు. అయితే,

"మీరో ప్రామిస్ చెయ్యాలి. వీటిని నేను కలం పేరుతోనే పంపుతాను. నేను బొమ్మలు వేస్తానని గానీ, ఈ కలం పేరు నాదనిగానీ మన ఆఫీసులో యెవరితోనూ చెప్పకూడదు" అన్నాడు చివరికి. అయితే కారణం మాత్రం చెప్పలేదు. "ఏంలేదు. నేను బొమ్మలు వేస్తానని ఎవరికీ తెలియటం ఇష్టంలేదంతే"అన్నాడు. అతని కలంపేరు 'ఊహాసుందరి'.

అదే పేరుతో అతను పంపిన చిత్రాలు పత్రికల్లో అచ్చవసాగాయి. ఆ విషయం నేను ఎవరితోనూ చెప్పలేదు. పది కథలు పడగానే ఎంత అనామకుడికయినా ఓ పేరంటూవస్తుంది గానీ, పది బొమ్మలు పడినంత మాత్రాన ఈ ఆంధ్రదేశంలో ఏ చిత్రకారుడికి పెద్ద గుర్తింపు వస్తుంది గనక? అందుకే 'ఊహాసుందరి' అన్న ఆర్టిస్టు ఈమధ్య చాలా బొమ్మలు వేస్తున్నాడన్న విషయమూ మా ఆఫీసులో ఎవరికీ పట్టలేదు.

* * *

దాదాపు ఏడాది దాటింది సుందరం మా ఆఫీసులో చేరి. ఈ ఏడాది కాలంలోనూ అతడి పిసినిగొట్టు స్వభావానికి అతన్ని అసహ్యించుకునే వాళ్లుకూడా అతని మాటల ధోరణికి, కలివిడి తనానికి కట్టుబడిపోయి అతనంటే కాస్త చనువుగానే వుంటున్నారు.

మరో నెలరోజుల్లో నా పెళ్ళి! ఈవిషయం తెలియగానే ఎందుకో షాక్ తిన్నట్టు కనిపించాడు సుందరం. నాకు ఆశ్చర్యం అనిపించింది అతని ప్రవర్తన. కానీ, అరగంటన్నా కాక ముందే తేరుకున్నాడతను. నా కాబోయే శ్రీమతిని గురించిన వివరాలన్నీ ఉత్సాహంగా అడిగాడు. అప్పట్నుంచీ పెళ్ళి ప్రయత్నాల్లో— వెడ్డింగ్ కార్డ్ డిజయిన్ దగ్గర్నుంచీ, నా బట్టల సెలక్షన్‌వరకూ అన్నింట్లో — చాలా ఉత్సాహంగా సహాయంచేశాడు.

"చాలా థాంక్స్ సుందరంగారూ, మీ పెళ్ళిక్కూడా అన్నిపనులూ నేనేచూసి పెడతాను" అన్నాన్నేను.

"థాంక్స్. కానీ, అలాంటి అవసరంమీకు రాదులెండి."


నవ్వుతూనే అన్నా ఆ మాటల వెనక దాగున్న విషాదం నన్ను కదిలించింది.

"అదేమిటి? మీకు పెళ్ళి కానేకాదా? భలే వారే, భూమిమీదపడ్డ ప్రతివారికీ ఆ బ్రహ్మదేవుడు ఎవరో ఒకరిని జంట కూరుస్తూనే వుంటాడు. మీరు ఆ జంజాటమంతా తప్పించుకుని సుఖంగా బతికేద్దామనుకున్నా కుదర్దు" అన్నాను నవ్వు తెప్పించుకునే ప్రయత్నంచేస్తూ. ఏమీ జవాబివ్వలేదు సుందరం. మౌనంగా వూరుకుండి పోయాడు.

* * *

నా శ్రీమతి కాపురానికి వచ్చినప్పటినుంచీ మా యింటికి రావటం తగ్గించేశాడు సుందరం. కొత్తకాపురం మోజులో నేనూ అతడినిగురించి పట్టించుకోవటం తగ్గిపోయింది. ఆఫీసులో మాత్రం ఎప్పటిలాగే మాట్లాడుకుంటూ వుండే వాళ్ళం.

ఆరోజు రాత్రి సెకండ్ షో చూసి, నేనూ, లక్ష్మి నడిచి వస్తున్నాం. పుచ్చపువ్వులాంటి



వెన్నెల్లో, నిర్మానుష్యంగావున్న హైద్రాబాద్ రోడ్ల మీద లక్ష్మిచేతిని పట్టుకు నడుస్తుంటే చెప్పలేనంత హాయిగా అనిపించింది. అయితే అంతలోనే నా మనసుని కలుషితం చేస్తూ కనిపించిందా దృశ్యం—రోడ్డు పక్కగావున్న బార్ లోంచి తూలుతూ వస్తున్నాడు సుందరం. అతని రూపం ఆ వెన్నెల వెలుగులో అంత స్పష్టంగా తెలియక పోయివుంటే, నేను నమ్మగలిగి వుండేవాడిని కాదు అతను సుందరమేనని. దగ్గరకు వెళ్ళి మాట్లాడించాలని, ఎందుకింత హఠాత్తుగా ఇలాంటి పనిచేశాడో తెలుసుకోవాలని అనిపించినా, లక్ష్మి దృష్టిలో కూడా అతన్ని చెడ్డవాణ్ని చెయ్యటం ఇష్టంలేక, ఆమెదృష్టి అటు పడకుండా జాగ్రత్తపడుతూ ముందుకి నడిచాను.

ఇంటికి చేరాకకూడా నామనసు ఆ విషయం మీదే నిల్చిపోయింది. 'సిగరెట్ కూడా తాగని సుందరం ఇంత హఠాత్తుగా ఇలాటి స్థితికెలా దిగజారాడు?' ఎంత ఆలోచించినా జవాబు దొరక్క వూరుకున్నాను.

* * *

రాత్రి పదిగంటలకి వచ్చే ఎక్స్‌ప్రెస్‌లో మా అన్నయ్య వస్తున్నాట్ట. సాయంత్రమే టెలిగ్రామ్ వచ్చింది. స్టేషన్‌కి వెళ్ళాను. తీరా కనుక్కుంటే, ఎక్స్‌ప్రెస్ రెండుగంటలు లేటుట? ఏం చెయ్యాలో తోచక, హిగిన్ బాదమ్స్‌లో ఓ నవల కొనుక్కుని అక్కడే వెయిటింగ్ రూంలో కూర్చున్నాను. పన్నెండు గంటలయింది. మరో అరగంటలేటని ఎనౌన్స్ చేశారు. మరీ బోరుగా అనిపించింది. స్టేషన్ బయటికి నడిచాను. దగ్గరేవున్న ఇరానీ రెస్టారెంట్‌లోకి వెళ్లి 'చాయ్'కి ఆర్డరిచ్చాను. చాయ్ తాగుతూ యథాలాపంగా బయటకు చూసాను. రోడ్డుకి అవతలివైపున—దూరంగా తలవంచుకుని నడుస్తున్న వ్యక్తి—అతను సుందరమే! ఎడారిలో ఒయాసిస్సు కనిపించినట్లయింది. ఈ సుదీర్ఘ నిరీక్షణలో నాకు తోడుగా వుంటాడనిపించింది. బయటకివచ్చి, "సుందరం" అంటూ కేకేశాను. అతనికి వినిపించినట్టు లేదు. గబగబా అతడి దగ్గరగా నడిచాను. భుజంమీద చెయ్యి వేసేసరికి తలతిప్పి చూశాడు. అతని దగ్గర్నుంచి లిక్కర్ కంపుతోపాటు, యేదో చౌకబారు సెంటువాసనకూడా వస్తోంది. స్టన్ అయిపోయాను నేను—నలిగిపోయిన అతని బట్టలు, వాలకంచూసి! నన్ను చూస్తూనే, ఎవరో ఎరగని వ్యక్తిని చూసినట్టు చూసి గబగబా వెళ్ళిపోయాడతను.

అలాగే రెండు నిముషాలు నిలబడిపోయి,

నెమ్మదిగా రెస్టారెంట్‌లోకి నడిచాను. టీ చల్లబడిపోయింది. మరో టీకి ఆర్డరిచ్చి, సిగరెట్ వెలిగించుకు కూర్చున్నాను.

'ఈమధ్య సుందరంలో వస్తున్న ఈమార్పుకి కారణాలేమిటి? ఇప్పుడు అతను దర్శనమిచ్చిన వైఖరికీ, మధ్యాహ్నం జరిగిన సంఘటన కూడా కారణమా?'

శ్రావణమాసం నోములంటూ పుట్టింటికి వెళ్లిన శ్రీమతి ఈవారంలో వస్తుందని అనుకుంటున్నాను గానీ—ఇవాళ ఉదయమే వస్తుందని వూహించలేదు. పొద్దున లేచేవేళకే ఆమె రావటంతో, హుషారుగా ఇవాళ ఆఫీసుకు శెలవు పడేసాను. మధ్యాహ్నం ఒంటిగంట వేళ—కాలింగ్‌బెల్ మోగటంతో, పోస్టుమాన్ అనుకుని ఆదరాబాదరా అనాచ్ఛాదితంగావున్న ఒంటిమీద టవల్ పడేసుకుని వెళ్ళి, తలుపు తీశాను—ఆ వచ్చింది సుందరం! తడబాటుగా "రండి, రండి" అంటూ లోపలి కాహ్వానించాను.

అతన్ని ముందు గదిలో కూర్చోబెట్టి, లోపలికి వెళ్లి బనీన్ వేసుకుని, లక్ష్మితో కాఫీ కలపమని చెప్పి బయటకి వచ్చాను.

"మీ మిసెస్ వచ్చారా?" అని అడిగాడు సుందరం.

తలూపాను, కొంచెం సిగ్గుపడుతూ.

నాకేసి చూసి నవ్వాడు సుందరం.

"సారీ, నిద్రపోతున్నట్టున్నారు. డిస్టర్బ్ చేశానా?"

ఇహ ఈ ప్రసక్తి ఆపుచేస్తే బాగుంటుందనిపించింది నాకు.

"సిక్ ఇంటిమేషన్ పంపాను. సెక్షన్లో అందిందా?" మాట మార్చాను.

"అందింది. అదిచూసే, యేమయిందో చూద్దామని లంచ్‌లో ఇటొచ్చాను" అన్నాడు అతను.

కాసేపు ఏదో మాట్లాడుకున్నాక, కాఫీతాగి సుందరం వెళ్లిపోయాడు. కానీ ఆ మాటల లోనే అతనిలో ఏదో కలవరం తడబాటు కనిపించాయి. అన్యమనస్కంగా వున్నట్టు కనిపించాడు.

ఈమధ్య నెలరోజులుగా గమనిస్తున్నాను. ఎప్పుడూ ఏదో ఓ పుస్తకం చదవటం అతనికి అలవాటే అయినా, ఈ మధ్యనే తెల్లని అట్టలు వేసిన పుస్తకాలు అతని చేతిలో ఒకటి, రెండు సార్లు చూశాను. వాళ్ళగదికి వెళ్ళినప్పుడు కూడా అంతవరకూ చదువుతున్న బుక్ తలగడ కిందికి తోసెయ్యటమూ గమనించినా, చూడనట్టే ఊరుకున్నాను.

ఇప్పుడు కనిపించిన అతని రూపానికి అవి అన్నీ భాష్యాలలాగా తోస్తున్నాయి నెమ్మదిగా ఆలోచిస్తే.

'ఛీ! ఏమిటీమనిషి? పెళ్ళెందుకు చెసుకో కూడదు? ఏం, ఆ మాత్రం ఆడపిల్లే దొరకదా అతను చేసుకోదలిస్తే? ఎందుకీ కక్కుర్తి.

'ఏమైనా, ఇకనుంచి సుందరంతో చనువు తగ్గించడం మంచిదన్న నిర్ణయానికి వచ్చాను. అతనితోబాటు నన్నూ నాలుగు రకాలుగా అనుకుంటారు అందరూ, ఇంకా ఇదివరకటిలాగే మెసిలితే'— అనుకుంటూ స్టేషన్‌వైపు నడిచాను.

మర్నాడు ఆఫీసులో ఏమీ జరగనట్టే ప్రవర్తించాడు సుందరం. నేనొకవేళ అడిగినా బహుశః నేను చూసింది అతడిని కాదని దబాయిస్తాడేమో అనిపించింది. నేనసలేమీ అడగదల్చుకోలేదు కూడా.

*　　*　　*

మూడు, నాలుగు నెలలు గడిచాయి. నాకూ సుందరానికీ మధ్య దూరం ఏర్పడింది. నాతోనే కాదు, మిగతా ఎవ్వరితోనూ మునుపటిలాగా ఉత్సాహంగా వుండటం లేదతను. ముభావంగా వుంటున్నాడు. మనిషికూడా చిక్కిపోతున్నట్లు కనిపిస్తున్నాడు.

ఆరోజు ఉదయం మామూలుగానే ఆఫీసుకు వచ్చిన సుందరం, పన్నెండుగంటలు కావస్తుండగా నా దగ్గరకు వచ్చాడు.

"ఎందుకో పావుగంటనించీ గుండెలో నొప్పిగా వుందండీ" అన్నాడు.

ఆదుర్దాగా లేచాను నేను. ఆఫీసు డాక్టర్‌కు

ఆ పాపం నా మనసులో రేపిన మంటలు ఏ మందుకీ, ఏ సెక్సు పుస్తకాలకీ చల్లారలేదు. అందుకే అందుకే మొదటిసారిగా రాత్రి డబ్బుతో సుఖం కొనుక్కున్నాను. డబ్బుకి దొరికే సుఖంలో సహజత్వం ఎలా వుంటుంది? అందుకే, నేను మధ్యాహ్నం వెళ్ళేసరికి సిగ్గుపడుతూ ఆహ్వానించిన శివరాం, రాత్రి అలాటి అవస్థలోనే వున్న నన్ను పలకరిస్తే- సిగ్గుతో తలెత్తుకోలేక పారిపోయి వచ్చాను.

ఆ సిగ్గుకీ, ఈ సిగ్గుకీ ఎంత తేడా! స్వర్గానికీ, నరకానికీ వున్నంత తేడా!'

నా మనసు మొద్దుబారి నట్టయింది. కాసేపు ఆగి మిగతా పేజీలు తిరగేశాను.

'తాగుడు మరీ ఎక్కువయి పోతోంది. తాగందే ఆగలేకపోతున్నాను. ఆగి యెవర్ని ఉద్ధరించాలి? నెలనెల కడుపు కట్టుకు దాస్తున్న డబ్బు అమ్మ పేరనే వుంది. అంతకన్న నేనేం చెయ్యలేను.

ఆరోగ్యంకూడా పూర్తిగా చెడిపోతోందని పిస్తోంది. ఇదివరకున్న హార్ట్ కంప్లయింట్ కి ఇదీ తోడు అవుతోందా? కానియ్ . చావే త్వరగా రానియ్ ఐ వెల్ కం డెత్ .'

చేతుల్లోంచి పుస్తకం జారిపోయింది.

* * *

తెలతెలవారే వేళకి సుందరం తల్లి, ఇద్దరు కూతుళ్ళతో వచ్చింది. వాళ్ళిద్దర్నీ చూసేసరికి నాకు కళ్ళు తిరిగినట్లయింది. ముమ్మూర్తులా సుందరంలాగే వున్నారు ఇద్దరూ!

సుందరం మరణవార్త చెప్పాక, వాళ్ళని ఓదార్చటం నా తరం కాలేదు.

నే చెయ్యగలిగిన సహాయంతా చేసి, ఆఫీస్‌లో సుందరానికి రావలసిందంతా ఇప్పించేశాక మరిక నాకేపనీ మిగల్లేదు. సుందరం ఆలోచనలు మాత్రం నా మనసులో శాశ్వతంగా మిగిలిపోయాయి. □

